





రికవరీ మేళాలో వస్తువులను పరిశీలిస్తున్న సిపి రవిశంకర్

పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో ఫిబ్రవరి నెల రికవరీ మేళాను ఆదివారం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నగర జాయింట్ కమిషనర్ పకీరప్ప మాట్లాడుతూ 'విశాఖలో 86 దొంగతనాలు ఫిబ్రవరిలో చోటు చేసుకున్నాయి. ఈ కేసులలో ఒక కోటీ 50 లక్షలా 48 వేలా 239 రూపాయల విలువగల వస్తువులను దోచుకున్నారు. 49 కేసులను ఛేదించాం. ఒక కోటీ 42 వేలా 51 రూపాయల నగదు, 813.28 గ్రాములు బంగారం, 583.20 గ్రాములు వెండి, 20 కంటైనర్లు, 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నాం' అని తెలిపారు. గంజాయి రవాణానూ అరికట్టామని చెప్పారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువయ్యేందుకు ఫిబ్రవరిలో రెండుసార్లు డయల్ యువర్ సిపి కార్యక్రమం నిర్వహించామని, ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల 94 ఏళ్ల వృద్ధ మహిళ భూకబ్జా కేసును తానే స్వయంగా వెళ్లి పరిష్కరించానన్నారు. ఈ నెల 6వ తేదీన నగరంలోని 21 పోలీస్ స్టేషన్లలో భూకబ్జాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

తోపుడు బండ్లు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తీరును నిరసిస్తూ పిఠాపురం కాలనీ రోడ్డులో సిఐటియు ఆధ్వర్యంలో తోపుడు బండ్లు కార్మికులు ఆదివారం ధర్నా చేపట్టారు. వారినుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, మద్దిలపాలెం జోన్ నాయకులు వి.కృష్ణారావు మాట్లాడారు. జివిఎంసి 22వ వార్డు కళాభారతి రోడ్డులో ఇరవై ఏళ్లుగా తోపుడు బండ్లు కార్మికులు, సంత, వీధి విక్రయదారులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇలా చిరు వ్యాపారాలు సాగిస్తున్న 200 మందిపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ దాడి చేసి తోపుడు బండ్లును తొలగించడం దారుణమన్నారు. వీధి విక్రయదారులకు 2014లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జోక్యంతో చట్టం తెచ్చిందన్నారు. ఆ చట్ట ప్రకారం ఎక్కడైతే చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారో అక్కడే వారికి ఉపాధి రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. జన సంచారం లేనిచోటకు వెళ్ళి వ్యాపారాలు చేసుకోండని చెప్పడమంటే వారి పొట్టకొట్టడమేనన్నారు. తక్షణమే కార్పొరేటర్ ఆలోచన మార్చుకోవాలని, స్థానికులను ఒప్పించి అక్కడే జీవనోపాధి పొందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో కార్పొరేటర్ ఇంటిని ముట్టడించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం తోపుడు బండ్లు, సంత యధావిధిగా పెడతామన్నారు. ధర్నాలో సిఐటియు జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, 22వ వార్డు కార్యదర్శి అనపర్తి అప్పారావు, తోపుడుబండ్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, సహాయ కార్యదర్శి కె.కుమారి, బన్నీ, శ్రీను పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

బిగిసిన 'ఉక్కు' పిడికిళ్లు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ మహాపాదయాత్రకు కదిలొచ్చిన ప్రజానీకం
- పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు
- కేంద్ర బిజెపిపై నిప్పులు చెరిగిన నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఉక్కునగరం విలేకరులు (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికలోకం పిడికిళ్లు బిగిశాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివారం తలపెట్టిన మహా పాదయాత్రకు ప్రజానీకం వెల్లువలా కదిలొచ్చింది. ఈ మహా పాదయాత్ర కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ సాగగా అన్నిచోట్లా అపూర్వ స్వాగతం లభించింది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు చేసిన ప్రసంగం ఆలోచింపజేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపికి అవకాశం లేని రాజకీయ నిర్ణయం తీసుకోవాలని కోరారు. బిజెపిని బలపరిచే ఏ నిర్ణయమైనా అది స్టీల్‌ప్లాంట్ రక్షణకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ సమైక్య పోరాట ఫలితంగానే మోడీ ప్రభుత్వం ఇంతవరకూ స్టీల్ ప్లాంట్‌ను అమ్మలేక పోయిందన్నారు. అయితే స్టీల్‌ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి నష్టాల్లోకి నెట్టి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలను మాత్రం ఆపలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు బిజెపి నేతలు ప్రకటనలు చేసి ప్రజలను వంచిస్తున్నారని తెలిపారు. ప్లాంటుకు వర్కింగ్ క్యాపిటల్, సొంత గనులు ఇవ్వకుండా, ప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడవనివ్వకుండా, ఐదు వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎలా లాభాలబాట పట్టిస్తారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌కు, విశాఖకు, ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపిని రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిని చేసి ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నవభారత నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జెవి.సత్యనారాయణ మూర్తి, టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.శ్రీభరత్, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, కాంగ్రెస్ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి రాకేష్ రెడ్డి, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరాం, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పలు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఈ మహా పాదయాత్రకు విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి ఉరుకూటి చందు తదితరులు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



వేలాది మందితో సాగుతున్న మహా పాదయాత్ర



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

పూలవర్షం

పాదయాత్రకు సిపిఎం స్టీల్‌జోన్, మల్కాపురం, గాజువాక పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, అక్కయ్యపాలెం, ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ జోన్ల కార్యకర్తలు, సభ్యులు సంఘీభావం తెలిపారు. తమ తమ ప్రాంతాలు, కేంద్రాల్లో మహా పాదయాత్ర బృందంపై పూలు జల్లి అభినందనలు తెలిపారు. తమ బ్యానర్లు, జెండాలు చేబూని స్టీల్‌ప్లాంట్ రక్షణ నినాదాలు చేశారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో సిపిఎం నేతలు పివియస్‌బి.శ్రీనివాసరాజు, రామస్వామి, ఎం.రాంబాబు, పి.పైడిరాజు, బి.రమణి, బి.వెంకటరావు, బి.ఈశ్వరమ్మ, యుఎస్ఎన్.రాజు, ఎ.నరేంద్ర కుమార్, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ముంగిటకు వ్యవసాయ సాంకేతికత

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేలా ప్రణాళికలు
- 'ప్రజాశక్తి'తో ఆత్మ పీడీ ఆశాదేవి





ప్రజాశక్తి - అనకాపల్లి : వ్యవసాయ సాంకేతికతను రైతుల ముంగిటకు తీసుకువచ్చి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) కృషి చేస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఆశాదేవి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆమె సంస్థకు సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఆత్మ ప్రధాన లక్ష్యం ఏంటి ?

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చేలా చూడటమే ఆత్మ ప్రధాన లక్ష్యం.

రైతులకు ఎటువంటి శిక్షణలు ఇస్తున్నారు ?

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణలో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను తెలియజేస్తున్నాం. వారు నైపుణ్యం పెంచుకొని ఆర్థికంగా నిడదొక్కుకునేందుకు స్కిల్ ట్రైనింగ్ ఇస్తున్నాం. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో భూసార పరిరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఒక్కో పాఠశాల నుంచి 50 మంది విద్యార్థులకు శిక్షణ, విశ్లేషణ కార్యక్రమాలు అందిస్తున్నాం. అందులో విశాఖపట్నం కెవికె, వి సిటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ సిబ్బంది, భూసార పరిరక్షణ శాఖ అధికారులు పాల్గొంటున్నారు.

భూసార పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

భూసారం పెంచుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే విషయంపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. వేసవిలో కూరగాయల పెంపకం, జీడి మామిడిలో అధిక దిగుబడులకు తీసుకోవలసిన చర్యలును అందరికీ తెలియజేస్తున్నాం. సన్నకారు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

చెరుకు రైతుల అభివద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

చెరుకు ఉత్పత్తి ఖర్చులు పెరగడం, కూలి కొరత నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు తెలియజేయడంతో పాటు సరుకులో అధిక ఉత్పత్తులు, వాల్యూ యాడెడ్ ద్వారా అధిక ఆదాయాన్ని పొందేందుకు శిక్షణలు ఇస్తున్నాం. ఇంతవరకు 38 శిక్షణలు ఇచ్చాం.

చిరుధాన్యాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారా ?

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో రాగుల్లో సాంప్రదాయ విత్తనాలు తయారు చేసుకోవడం వంటివాటిపై అవగాహన కల్పిస్తున్నాం.

బిసిలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ బిసిల జనాభా అధికంగా ఉందని, దానిని గుర్తించి దామాషా ప్రకారం రానున్న ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలూ బిసిలకు ప్రాధాన్యత కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిసిలకు దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించని పార్టీలను ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 2, 3 శాతం జనాభా కలిగిన కులాల వారే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తున్నారని చెప్పారు. సమావేశంలో కుమ్మరి క్రాంతి కుమార్, గొర్రె శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.


సిఎం సభ ఏర్పాట్ల పరిశీలన



ముఖ్యమంత్రి సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, జెసి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 7న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా పిసినికాడలో సభాస్థలిని ఎమ్మెల్సీ తలసిల రఘురాం, జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి వైసిపి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం



'అమ్మ' ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువతతో నిర్వాహకులు, నేతలు

ప్రజాశక్తి- కె. కోటపాడు: అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎ.కోడూరు జెడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక రాజకీయ నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు ప్రారంభించిన రక్తదానశిబిరంలో 42 మంది యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయగా, దాతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు. రక్తదాన శిబిరం నిర్వహణకు ముందుకొచ్చి, సహకరించిన అమ్మ ట్రస్ట్ ప్రతినిధులను పలువురు అభినందించారు.

కార్యక్రమంలో జెడ్‌పిటిటిసి అనురాధ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాడుగుల టిడిపి ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, పైలా సన్యాసి నాయుడు, స్థానిక ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ట్రస్ట్ ఛైర్మన్ గొంప వెంకటరావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.శివ ప్రసాద్, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఎండీ వినోద్‌బాలు, ఎ.కోడూరు మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, సూరెడ్డి బాబురావు, దొగ్గ ఎరుకు నాయుడు, ఎన్‌సిసి టీమ్, లెక్కల కోటేశ్వరరావు, సెక్రెటరీ సింగంపల్లి అచ్చిబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు లెక్కల సత్యనారాయణ, వి.బంగారునాయుడు, వైస్‌ఛైర్మన్ సింగంపల్లి అర్జున, ట్రస్ట్ సభ్యులు ఆర్‌కె.నాయుడు, సింగంపల్లి రామారావు, లెక్కల శ్రీధర్, ఎవిఎస్ఎన్. మూర్తి, పి.తమ్మారావు పాల్గొన్నారు

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని కింతాడ శివారు రామచంద్రపురంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుండి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆదివారం ప్రతిష్ట వేడుక వైభవంగా జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కన్నూరు సూర్యనారాయణ, కె.కోటపాడు మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి- మునగపాక: విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జిల్లా కాంగ్రెస్‌ఉపాధ్యక్షుడు పోలమరశెట్టి ఆదిమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని నాగులాపల్లి గ్రామంలో ఎలమంచిలి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తనను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని ప్రగల్బాలను పలికి ముఖ్యమంత్రి జగన్, మాట తప్పి, మడమ తిప్పి ప్రజలను మోసపుచ్చారన్నారు. ఎపిసిసి అధ్యక్షురాలిగా వైఎస్. షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునరుత్తేజం వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి, అధికారంలోకి తీసుకువస్తే ప్రత్యేకహోదాపై రాహుల్‌గాంధీ తొలి సంతకం చేస్తారన్నారు. కాంగ్రెస్ గెలుపునకు పార్టీ కేడరంతా సమైక్యంగా పనిచేసి, కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. అనంతరం డిసిసి ఉపాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ఆదిమూర్తిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో పిసిసి కార్యవర్గ సభ్యుడు కూండ్రపు అప్పారావు, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు తనకాల అనంతరావు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు రాహుల్, మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి వెంకటరావు, డిసిసి ప్రధాన కార్యదర్శి రావి రామ సత్యం, ఎలమంచిలి పట్టణ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూర్తి

7, 8 తేదీల్లో ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 7, 8 తేదీల్లో ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు బుద్ధ శివ, విల్లూరి ప్రసాద్ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ కన్వీనర్ ఎల్లపు గోవింద తెలిపారు. ఆదివారం గవరపాలెం దిబ్బవీధి కమ్యూనిటీ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ, క్రీడలకు పుట్టినిల్లయిన గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో ఇప్పటికే పలు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించామన్నారు. ఇపుడు ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలను సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఫ్లడ్‌లైట్స్ వెలుగులో నిర్వహిస్తామని, ఈ మేరకు తొమ్మిది జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. నాకౌట్ పద్ధతిలో పద్ధతిలో జరిగే ఈ పోటీలను ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘుబాబు ప్రారంభిస్తారని, కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య జ్యోతి ప్రజ్వలన చేస్తారన్నారు. విజేతలకు సంఘ సేవకులు కాండ్రేగుల నాయుడు, శ్రీరామ్ బహుమతులను అందిస్తారన్నారు. పోటీలకు కాండ్రేగుల శ్రీరామ్, పెంటకోట చిన్న, కాండ్రేగుల నాయుడు, వెదురుపర్తి సుందరయ్యబాబు, మద్దాల కృష్ణ, సీతారామ దేవస్థానం ముఖ్య ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.6వేలు, నాలుగో బహుమతిగా రూ.4 వేల నగదుతోపాటు షీల్స్ అందిస్తామన్నారు.

పోటీ పరీక్షల పట్ల అవగాహన

ప్రజాశక్తి -అనకాపల్లి : పోటీ పరీక్షల పట్ల విద్యార్థుల్లో అవగాహన, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే టాలెంట్ టెస్ట్ లక్ష్యమని గౌరీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్వాహకులు అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు టాలెంటు పరీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 378 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. పోటీ పరీక్షల్లో మెలకువలు తెలుసుకునేందుకు ఓఎంఆర్ సీట్లు ఉపయోగించి ప్రభుత్వ పోటీ పరీక్షల మాదిరిగానే నిర్వహించారు. బుచ్చయ్యపేటఎంఇఒ బికెఎస్. విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన సంఘ అధ్యక్షులు ఆడారి నారాయణమూర్తి, గౌరవ అధ్యక్షులు ఎ. గోవిందరావు, ఉపాధ్యక్షులు రాపేటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.జోగా అప్పారావు, నిర్వాహకులు పీలా నారాయణరావు, బికెవి. గోవిందరావు, కె.నరసింహ, కోశాధికారి ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5న మంగళగిరిలో బిసి సదస్సు

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడిపి హయాంలో అమలు చేసిన బిసి పథకాలన్నీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రద్దు చేశారని అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మండిపడ్డారు 30కి పైగా బిసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, బిసి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని, బిసి పథకాలను రద్దుచేసి బిసిల ద్రోహిగా నిలిచారన్నారు. ఆదివారం. అనకాపల్లి పార్లమెంటరీ కార్యాలయంలో టిడిపి బిసి సెల్ సమావేశంలో మాట్లాడుతూ, బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే టిడిపికి చెందిన ముఖ్య బిసి నేతలు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర వంటి వారిపైకూడా అక్రమ కేసులు బనాయించి జైలుకు తరలించారన్నారు. మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడుపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో 30 మంది బిసి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. రాష్ట్రంలోని బిసిలను ఉద్ధరించామని గొప్పలు చెబుతూ, పక్క రాష్ట్రం తెలంగాణలోని ఆర్.కృష్ణయ్యకు సొంత సిబిఐ కేసులను వాదించే నిరంజన్‌రెడ్డి. లయన్స్ ఇండస్ట్రీస్ కార్పొరేట్ అఫైర్స్ ప్రెసిడెంట్ పరిమళ నత్వానికి ఎపి నుంచి రాజ్యసభ సీటిచ్చారన్నారు. నిధులు, విధులు లేని 56 అలంకారప్రాయ బిసి కార్పొరేషన్లను పెట్టి, ఆ పార్టీ నేతలకు రాజకీయ ఉద్యోగం కల్పించారన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గింజలా లక్ష్మణ్ రావు, నాయకులు గుడాల సత్యనారాయణ ముదిరాజ్, గుర్రం నూకరాజు, వాయిబోయిన రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి: ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు ప్రభుత్వపరంగా చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే క్రమంలో సిగ్నల్స్, అధిక ట్రాఫిక్‌తో పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల సమయంలో ఎక్కడికక్కడే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసుశాఖ తగు చర్యలు చేపట్టాలని సూచించారు. దీనిపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలకు కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులపై apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు గృహ నిర్బంధం

ప్రజాశక్తి- కశింకోట : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం విధానాల రద్దుపై రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్‌తో ఆదివారం విశాఖపట్నంలో ఆదివారం జరగబోవు మహా గర్జన సభకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు ఇందులో భాగంగా . అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తట్టా కృష్ణను కశింకోటలోని అతని ఇంటిలో పోలీసులు నిర్బంధించారు.

ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు పూడి వెంకటరావు మాట్లాడుతూ, తమ సమస్యలను, డిమాండ్లపై మాట్లాడడానికి, పోరాటానికి కూడా స్వేచ్ఛ లేకుండా నిర్బంధించడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 22 రోజులు సమ్మె చేస్తే, డిమాండ్లను నెరవేరుస్తామని నమ్మబలికి, కనీసం ఒక్క డిమాండ్ అయినా తీర్చకపోవడం దారుణమని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని కోరారు.



గృహనిర్బంధంలో కృష్ణ

ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశపరీక్షకు

దరఖాస్తుల స్వీకరణ : డిఇఒ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలల్లో 20024 -25 విద్యసంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 21న జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో తెలుగుచ ఇంగ్లీష్ మీడియంలో ఐదవ తరగతి స్థాయిలో జరుగుతుందన్నారు విద్యార్థులు సంబంధిత మండలంలో ప్రభుత్వ లేక గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2022 -23, 2023- 24 విద్యా సంవత్సరంలో చదువుతూ 5వ తరగతి ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు.. ఒసి, బిసి విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుండి 2014 ఆగస్టు 31 లోగా, అలాగే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2010 సెప్టెంబర్ ఒకటి నుంచి 2014 ఆగస్టు 31 లోగా జన్మించి ఉండాలన్నారు. www.cse.ap.gov.in/ apms.ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు మార్చి 31లోగా నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్ ఉపయోగించి గేట్‌వే ద్వారా పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. అనంతరం వారికి కేటాయించిన జనరల్ నెంబర్ ద్వారా ఏదేని ఇంటర్నెట్ సెంటర్లో నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒసి,బిసి విద్యార్థులు రూ.150 ఎస్‌సి,ఎస్‌టి విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో ఒని, బిసి విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు పొంది ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షల పొందిన మార్కులు ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి సీట్లు కేటాయిస్తామన్నారు. ఇతర వివరాలకు సంబంధిత ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లేదా మండల విద్యాశాఖ అధికారి లేదా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

'టిడిపితోనే పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టం'

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని కూండ్రం గ్రామంలో పంచాయతీరాజ్ డిక్లరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, సిఎం జగన్‌రెడ్డి పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశాడనానరు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్థానిక ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాన్ని 5రెట్లు పెంచుతామన్నారు. గ్రామాల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తామన్నారు. కూండ్రం గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరాటే పోటీల విజేతలతో కోచ్, నిర్వాహకులు

కరాటేలో బాలబాలికలకు పతకాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి గొజూర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యాన నిడదవోలులో నిర్వహించిన ఎపి - తెలంగాణ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో జివిఎంసి నాలుగో వార్డుకు చెందిన జెన్‌షిటోర్యూ కరాటే అసోసియేషన్‌కు చెందిన బాల బాలికలు పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ వాసుపల్లి శ్రీహరి ఆదివారం తెలిపారు. బాలికల విభాగంలో 11 ఏళ్ల వాసుపల్లి భారతి, 14 ఏళ్ల కారి దేవి స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. బాలుర విభాగంలో 12 ఏళ్ల శరణ్ స్వర్ణ పతకం, 10 ఏళ్ల ఇప్పిలి మోహిత్ రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన బాల బాలికలను కోచ్ శ్రీహరి, ఛాంపియన్ నిర్వాహకులు రామమూర్తిరాజు, ప్రసన్నకుమారి అభినందించారు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఏరియా సమితి కార్యదర్శి రాంబాబు

రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డులో నిర్మించిన రైతు బజారును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు సంబంధిత అధికారులను కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, ఈ ప్రాంత రైతాంగం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న రైతు బజారును ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మతోన్మాద బిజెపితో అంటకాగుతున్న వైసిపి, టిడిపి, జనసేనలను ఈ ఎన్నికల్లో ఓడించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రైల్వే జోన్, ఇతర విభజన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అవకాశవాద రాజకీయాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్ర పూరిత వైఖరిని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. లౌకికతత్వాన్ని కాపాడుకోవాలని ప్రజలను కోరారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఎంలను ఎన్నికల్లో బలపరచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు ఎం.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చిల్ల నరసింహులు, అల్లు బాబూరావు, ఎన్.ఆదినారాయణ, ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పద్మనాభం రచ్చబండ వద్ద గీతం హాస్పిటల్ ఆధ్వర్యాన సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసినట్లు భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం ఇంచార్జ్ కోరాడ రాజబాబు తెలిపారు. ఈ శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. గీతం అధ్యక్షులు ఎం.శ్రీభరత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాన్ని ఆదివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్ ప్రెసిడెంట్ కె.జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాల 50 ఏళ్ల వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 50ఏళ్ల తరువాత ఇంత అభివృద్ధితో కాలేజీని చూడటం సంతోషంగా ఉందన్నారు. ఎందరికో ఉపాధి అవకాశాలు దక్కించుకునేలా కాలేజీ యాజమాన్యం కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. మరో 50ఏళ్లు ఇలానే ఉన్నత విద్యావకాశాలు విద్యార్థులు అందుకునేలా అధ్యాపక బృందం కృషిచేయాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధి అవకాశాల దృష్ట్యా ఆధునిక నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక నైపుణ్య శిక్షణను అందించే ప్రయత్నంలో భాగంగా కొన్ని కంపెనీలతో కళాశాల భాగస్వామ్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. చదువుతో పాటు ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులకు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తున్నట్లు చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థి, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాలేజీలో గడిపిన క్షణాలు గుర్తుకొస్తున్నాయన్నారు. అనంతరం కాలేజీ ప్రారంభమైన మొదటి సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, సినీ నటులు శుభలేఖ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై అతిథులతో బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థులు



హాజరైన సినీ నటుడు శుభలేఖ సుధాకర్

విలక్షణ రచయిత సుద్దాల అశోక్ తేజ



సుద్దాల అశోక్‌తేజ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-సీతమ్మధార : విలక్షణమైన రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ అని డాక్టర్ కిరణ్ ప్రభు కౌముది అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యాన పౌరగ్రంథాలయంలో ఆదివారం 40 సంవత్సరాల ప్రజాగీతాల పరివాజకుడు, 30 సంవత్సరాల సినీ గీతాల ప్రయాణికుడు, భాషారత్న డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట- పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కిరణ్ ప్రభు కౌమోది హాజరై మాట్లాడుతూ, సుద్దాల అశోక్ తేజ గొప్ప రచయిత, గేయకుడు అన్నారు. ఎన్నో వేల పాటలను రచించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఆయన ద్వారా మరిన్ని మంచి పాటలు, కవిత్వాలు భవిష్యత్తులో రావాలని అభిలషించారు.

డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ, పాటలు, రచనలు చేస్తూ పోవాలనేది తన కోరిక అన్నారు. తాను అనుకున్న పాటలు, రచనలు రాస్తూనే ఉంటానని తెలిపారు. సినిమా రంగంలోకి వెళ్లకముందు ఎన్నో రచనలు చేశానని, తద్వారానే సినిమా అవకాశాలు అందుపుచ్చుకున్నట్లు వివరించారు. 1989 సంవత్సరంలో బతుకు పాటలు రాసిన తర్వాత సినిమాల్లోకి అవకాశాలు వచ్చాయని తెలిపారు. అనంతరం సుద్దాల అశోక్ తేజ దంపతులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ గండికోట రఘురామారావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య ప్రయోగ సుబ్రహ్మణ్యం, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్.రావుకు వరల్డ్ ఐకాన్ 21 పురస్కారం



ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావుకు వరల్డ్ ఐకాన్ 21 పురస్కారాన్ని అందుకున్నారు. ఇండోనేషియా దేశం బాలి నగరంలో నిర్వహించిన 39వ ఆసియా ఫసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తమాలజీ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యంత ప్రతిభావంతులైన 23 మంది నేత్ర వైద్య నిపుణులను వరల్డ్ ఐకాన్ 21 అవార్డుతో సత్కరించింది. ఈ పురస్కారాల ఎంపిక ప్రక్రియలో డాక్టర్ ఎన్.రావు 10వ స్థానంలో నిలిచారు. 21వ శతాబ్దంలో నేత్ర సంరక్షణ రంగంలో కనబరిచిన అసాధారణమైన ఉత్తమ కృషి ఫలితమే ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారానికి ఎంపికైన మొదటి భారతీయుడుగా డాక్టర్ ఎన్.రావు నిలిచారు. డాక్టర్ ఎన్.రావు వరల్డ్ ఐకాన్ 21 పురస్కారం అందుకోవడం తమ సంస్థకు గర్వకారణమని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్య బృందం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలం బిఆర్. తాళ్లవలస గ్రామంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేస్తారని మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : త్రీ స్టార్స్ వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజిని ఈ వేడుకల్లో పాల్గొని మహిళలకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, కాయిత వెంకటలక్ష్మి, రత్నాకర్, రవణమ్మ, శ్రీనివాస్, లాయర్ ప్రసాద్, నాగరాజు, దిలీప్, శ్రీను, త్రీ స్టార్స్ వనిత వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ

సిఎం పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -మధురవాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన విశాఖ నగరానికి వస్తున్న సందర్భంగా నగర సుందరీకరణ, పరిశుభ్రత పనులను చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన జివిఎంసి అధికారులతో కలిసి మధురవాడ ఐటి సెజ్ హిల్ 3 వద్ద హెలిప్యాడ్ ప్రదేశం, రాడిసన్ బ్లూ హోటల్ వద్ద వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఐటి సెజ్ హిల్- 3 హెలిప్యాడ్ ప్రదేశం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు వివరించారు. అనంతరం హెలిపాడ్ నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు రోడ్లను పరిశీలించారు. రోడ్ల పరిశుభ్రత, పారిశుధ్యం, సెంటర్ మీడియన్ లైటింగ్, గ్రీనరీని నిరంతరం పర్యవేక్షించాలని, రోడ్లపై పశు సంచారం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తోపుడుబండ్లు రహదారికి ఆటంకం లేకుండా చూడాలని చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్‌ను, రోడ్లపై ఎక్కడైనా గుంతలు ఉంటే మరమత్తు పనులు వెంటనే చేపట్టాలని ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణరాజును కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


ప్రజాశక్తి -పద్మనాభం : ఆనందపురం, భీమిలి, పిఎం.పాలెం పోలీసు స్టేషన్ల పరిధిలోనిరౌడీ షీటర్లకు పద్మనాభం పోలీస్‌స్టేషన్లో ఆదివారం నార్త్ ఎసిపి బి.సునీల్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి వివాదాలలో తలదూర్చకూడదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని హితవుపలికారు.

ఆక్రమణలపై చర్యల్లో తాత్సారం!

-సిటీ క్లబ్ అక్రమాలపై ఎందుకీ మౌనముద్ర?- నోటీసులతో చేతులు దులుపుకున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక సిటీ క్లబ్ ఆవరణలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై నర్సీపట్నం మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనముద్ర వహిస్తున్నారో తెలియడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజులుగా సిటీ క్లబ్‌లో 11 దుకాణాల సముదాయాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా, సర్వే నంబర్ 357/3 లోని 55 సెంట్ల ప్రభుత్వ రెవెన్యూ భూమి స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులకు పట్టడం లేదు. దీనిపై స్థానికులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన కథనాలతో మున్సిపల్ అధికారుల్లో కదలిక వచ్చి ఆక్రమణదారులకు ప్రొవిజినల్ ఆర్డర్ నోటీసు, కన్ఫర్మేషన్ ఆర్డర్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, సిటీ క్లబ్ నిర్వాహకులు తమకేమీ పట్టనట్లు యథేచ్ఛగా నిర్మాణాలను కొనసాగించడంలో ఆంతర్యమేమిటో అంతుపట్టడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సిటీ క్లబ్‌ను ప్రజావసరాలకు వాడాలి



సిటీ క్లబ్‌ను ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకుని, అక్కడి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి. తర్వాత ప్రజా అవసరాలకు వినియోగించాలి. సిటీక్లబ్ అక్రమాలపై చర్యల్లో తాత్సారం ప్రోత్సహించినట్టే అవుతుంది.

పాకలపాటి అరవింద్ కుమార్‌రాజు, సామాజికవేత్త



సిటీ క్లబ్ లో నిర్మిస్తున్న నిర్మాణాలు

దీనిపై కొందరు సోమవారం ఆర్‌డిఒ జయరాం దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై ఆర్‌డిఒ స్పందించి, మున్సిపల్ కమిషనర్‌ను నిలదీయడంతో ఆయన నీళ్ల నమిలారు. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడమేనా తదుపరి చర్యలు ఏమైనా ఉన్నాయా అని ఆర్‌డిఒ ప్రశ్నించారు. పట్టణంలోని కొందరు పెద్దలు ఒత్తిడి కారణంగానే చర్యలకు అధికారులు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసుశాఖ సహకారంతో పనులను నిలుపుదల చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆర్‌డిఒ సూచించారు. సిటి క్లబ్ ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారో, దానికి అనుగుణంగా దీన్ని సామాన్య ప్రజావసరాలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని వేముల పూడి ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరంకు సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. దీని కోసం ఈ నెల 31వ తేదీ వరకు apms.ap.gov.inýË లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21వ తేదీన పాఠశాల వద్ద పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రిన్సిపాల్ సంధ్య

రావికమతం: మరుపాక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సత్య సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసి, బిసి అభ్యర్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.75లు ఆన్లైన్లో చెల్లించి పూర్తి చేసిన ధరకాస్తులను పాఠశాల పని దినాలలో కార్యాలయానికి అందజేయాలన్నారు.

కొండచిలువ హతం

ప్రజాశక్తి -వడ్డాది: బుచ్చయ్యపేట మండలం మంగళాపురం గ్రామంలో కొండచిలువను పలువురు హతం చేశారు. మంగళపురం గ్రామంలో ఎంపీ నిధులతో ఆయకట్టు పనులను గత కొద్ది రోజులుగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆయకట్టు పనులను చేస్తుండగా కొండచిలువ బయటపడింది. పనులు చేస్తున్న కూలీలు కొండచిలువను చూసి భయభ్రాంతులకు గురి అయ్యారు. హతమార్చడానికి భయపడి పరుగులు తీశారు. చివరకు జెసిబి సహాయంతో కొండచిలువను హతమార్చారు. దీంతో కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.



జెసిబిలో ఉన్న హతమైన కొండచిలువ

మహా గర్జన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: ఈనెల 9న జరిగే చలో అమరావతి వికలాంగుల మహా గర్జన సభకు జయప్రదం చేయాలని మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గెంజి శ్రీనివాస్ కోరారు. చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల దివ్యాంగుల సమక్షంలో పోస్టరు ఆవిష్కరణ చుపేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికలాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన 21 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఎమ్మార్పీఎస్, విహెచ్పిఎస్ వ్యవస్థాప అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మహాగర్జన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గట్రెడ్డి రాము, రావికమతం మండల కార్యదర్శి వియ్యపు ముసలి నాయుడు, మండల సలహాదారుడు అమరపల్లి నర్సింగ్ రావు, బుచ్చియ్యపేట మండల అధ్యక్షులు కాశి బాబు, నాలుగు మండలాల దివ్యాంగులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పథకాలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి- మాడుగుల: తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఆదివారం మాడుగుల మండలం కింతలి, వల్లపురం, పొంగలిపాక గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల జనరల్ సెక్రెటరీ ఉండూరు దేముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి శంఖారావం సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, యూనిట్ ఇంచార్జ్ మజ్జి బాబ్జి, పార్టీ ప్రెసిడెంట్ జోగినాయుడు, బూత్ ఇంచార్జిలు సత్తిబాబు, నాయుడు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తకోటలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శంకర్ పౌండేషన్, వాసవీ క్లబ్ (న్యూ) కొత్తకోట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 106 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 35 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఎంపిక చేసిన రోగులను శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ దేవ ప్రారంభించగా శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ వరహాలు, క్యాంపు కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్, వాసవీ క్లబ్ అధ్యక్షులు కె.రమేష్, సెక్రటరీ కె.నరేంద్ర, ట్రెజరీ పి.అశోక్, ఉపాధ్యక్షులు కె.రామా రావు పాల్గొన్నారు..

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట: తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రావికమతం మండలం టి.అర్జాపురం శివారు పాతకొట్నాబిల్లిలో ఆదివాసీ గిరిజనులు, సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెండల గౌరమ్మ, నందుల పూర్ణ, డేగల వరలక్ష్మి, తదితర గిరిజన మహిళలు మాట్లాడుతూ, గ్రామంలో 80 కుటుంబాలు 420 మంది జనాభా నివాసం ఉంటున్నామన్నారు. గ్రామంలో 25 సంవత్సరాల కిందట రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారని, పూర్తిగా శిథిలం అయ్యిందన్నారు. ట్యాంక్‌ను శుభ్రం చేయాలంటే ఎప్పుడు కూలి పో తుందోనన్న భయం వెంటాడుతోందన్నారు. దీంతో నీరు దుర్వాసన వస్తుందని వాపోయారు. నీళ్ల కలుషితంగా మారడంతో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దిక్కులేని పరిస్థితుల్లో పొలాలలో బోర్లు వద్దకు వెళ్లి నీళ్ల తెచ్చు కునే పరిస్థితి దాపురించిదని ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ పథకం కింద వాటర్ ట్యాంక్ నిర్మాణం చేసి, ఇంటింటికి నీరు సరఫరా చేయాలని కోరుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే స్పందించి పాత వాటర్ ట్యాంకును తొలగించి దాని స్థానంలో కొత్త ట్యాంక్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తా మని గిరిజన మహిళలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. గోవిందరావు, పలువురు మహి ళలు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న మహిళలు



ఉత్తర నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న బొత్స ఝాన్సీ, కెకె.రాజు

ఉత్తరంలో బొత్స ఝాన్సీ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ తన ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రారంభించారు. జివిఎంసి 49వ వార్డు పరిధి ఎన్జీవోస్ కాలనీలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మధుసూదననగర్ ఆర్చి నుంచి వైసిపి సమన్వయకర్త కెకె.రాజుతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కస్తూరినగర్, శాంతిపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, విఎంఆర్‌డిఎ చైర్మన్ సనపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్, నాయకులు రొంగలి జగన్నాథం, వుడా రవిరాజు, బొడ్డేటి కాశీవిశ్వనాథం, భరణికాన రామారావు, గుంటూరు నరసింహమూర్తి భారతి, బాణాల శ్రీనివాసరావు, కంపా హనుక్, చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, కెవిఎస్.శేఖర్, సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యాన 25వ వార్డు పరిధి సీతంపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ప్రారంభించారు. స్త్రీలు, పిల్లలు, దంత, కంటి సంబంధిత సమస్యలను డాక్టర్లు ఎస్.గౌతమ, లుథియా, మెర్సీ, రమేష్ కృష్ణ, సప్నా నరేష్, గంగాధర్ పరీక్షించారు. అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షులు కిరణ్ కుమార్, కార్యదర్శి రవిశంకర్ ప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షులు మెదిలి మహేష్, సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

'పీవీ' చరిత్ర తెలియాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ, విదేశాల ప్రజలకు స్ఫూర్తి దాతగా నిలిచిన భారత పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు జీవన విధానం, చరిత్ర నేటి తరానికి తెలియవలసిన అవసరం ఉందని తెలుగుదేశం నాయకులు ఆడారి కిషోర్‌కుమార్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన పీవీ మనుమడు ఎన్‌వి.సుభాష్‌ను ఆడారి కిషోర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పీవీ నరసింహారావుకు భారత రత్న పురస్కారం లభించడం దేశ ప్రజలకు గౌరవమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పీవీ ప్రభావంపై వక్తృత్వ, వ్యాస రచన, అవగాహన సదస్సులు నిర్వహించే విధంగా కృషి చేయాలన్నారు.

విద్యుత్ వైర్లతో భయాందోళన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ రహదారిలో వేలాడుతున్న విద్యుత్ వైర్లుతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామానికి వెళ్లే రహదారి పక్కన విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో బస్సులు, భారీ వాహనాలకు తగిలే అవకాశం ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ సర్పంచ్ బద్రెడ్డి మల్లికార్జునరావు, గ్రామస్తులు కోరుతున్నారు.



బస్సుకు అందిన ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు

గాజువాక - అగనంపూడి సర్వీస్ రోడ్డు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి- గాజువాక : పాత గాజువాక నుంచి అగనంపూడి వరకు సర్వీస్ రోడ్డును ఏర్పాటుచేయాలని వార్డ్స్ నివాస్, గాజువాకలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తీర్మానం చేశారు. గాజువాక సెలెక్ట్ కాంప్లెక్స్‌లో వార్డ్స్ నివాస్ ఆధ్వర్యాన కాలనీ అసోసియేషన్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పలు తీర్మానాలు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండేలా కేంద్ర ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేయాలని, చెత్త, ఆస్తి పన్ను రద్దుచేయాలని, ఇంటి పన్నునే మళ్లీ పునరుద్ధరించాలని, ట్రు అప్, ఫ్యూయల్ చార్జీలు, టోల్, పార్కింగ్, యూజర్ ఛార్జీలు రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. పట్టణ సంస్కరణలను ఉపసంహరించుకోవాలని, గాజువాకలో స్టేడియం నిర్మించాలని, కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ వరకు రోడ్డు విస్తరించాలని, గాజువాకలో మత్స్యమందులను నిర్మించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న యుజిడి పనులు పూర్తిచేయాలని, లైబ్రరీ ఏర్పాటు, సంతలు నిర్వహించేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని, గాజువాకలో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేయాలని కోరారు.

తోకాడలోని సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తమ అపార్ట్‌మెంట్‌కు జివిఎంసి ఎలా సరిహద్దు సమస్య ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. తాము చెత్త పన్ను చెల్లించలేదని, తమను చూసి మరో నాలుగు అపార్ట్‌మెంట్లు కూడా చెల్లించలేదని వివరించారు. దీనిపై రాజీలేని రోజుల్లో పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

వార్డ్స్ ఉపాధ్యక్షులు లక్ష్మణస్వామి మాట్లాడుతూ, విశాఖ డెయిరీ వల్ల గాజువాకతో పాటు అనేక ప్రాంతాలు కాలుష్యమయం అయ్యాయన్నారు.



సమస్యను వివరిస్తున్న సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు

శ్రీనగర్ అసోసియేషన్ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, తమకు శ్మశాన వాటిక సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పివిఎస్ రమణారావు మాట్లాడుతూ, మంచినీటి సమస్య, కాలువలో చెత్త సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైజాగ్ అభ్యర్థులు ఈ సమస్యలను మేనిఫెస్టోలో పొందుపరిచేలా మనం డిమాండ్ చేయాలని తీర్మానించారు. జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వార్డ్స్ నివాస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీ గణేష్, పిట్ట నారాయణమూర్తి, నాయకులు బి.గుర్రప్ప, ఎస్‌బిడి.వరప్రసాద్, త్రినాధ్‌స్వామి, కె.కిరీటం, కె.సంతోషం, బి.తౌడన్న, బంగారునాయుడు, పల్లెలు నర్సింగరావు, పాల్గొన్నారు.

పెయింటర్స్ అసోసియేషన్ ఏర్పాటు



పెయింటింగ్ కార్మికులతో ఎం.రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం గాజువాకలోని పెయింటర్లతో సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పెయింటింగ్ కాంట్రాక్టర్స్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెయింటర్లు సంఘంగా ఏర్పడితే గుర్తింపు ఉంటుందన్నారు. కార్మికులకు సంఘం యొక్క విశిష్టతను తెలిపారు. రాష్ట్రంలో కొన్ని వేల మంది పెయింటింగ్ కార్మికులు ఉన్నా గుర్తింపు లేదన్నారు. యూనియన్ పెట్టుకొని అందరూ ఏదో ఒక సంఘంలో ఉంటే గుర్తింపు లభిస్తుందని వివరించారు. భవిష్యత్తులో విశాఖ జిల్లాలో ఉన్న కార్మికులను ఐక్యం చేసే సంఘం సభ్యత్వం తీసుకునేటట్టు మీరందరూ కృషి చేయాలని రాంబాబు సూచించారు. ఎవరికి ఎక్కడ ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ సంఘం నాయకులు ముందుకెళ్లాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనకరాజు టోనీ బెహరా, కృష్ణ, చలపతి, రాజు, పెయింటింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నాకు టికెట్ రాకుండా తిప్పల యత్నం

వైసిపి గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనకు టికెట్ రాకుండా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని గాజువాక వైసిపి సమన్వయకర్త ఉరుకూటి చందు ఆరోపించారు. జివిఎంసి 66వ వార్డు పరిధిలో ఆదివారం ఏర్పాటుచేసిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన కుటుంబం మూడు తరాలుగా రాజకీయంలో ఉందన్నారు. తనకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించడంతో ఎమ్మెల్యేగా టికెట్ రాకుండా చేసి మేయర్‌ను గాజువాక తీసుకొచ్చేలా తిప్పల నాగిరెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనకు మద్దతు తెలిపిన కార్పొరేటర్లను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు సహకరించకుండా ఏకపక్షంగానే నిర్ణయాలు తీసుకుని ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, గాజువాకకు చెందిన వ్యక్తిని కాకుండా మేయర్‌ను పోటీకి పెడితే ఏం లాభం అని ప్రశ్నించారు. మేయర్ నగరమంతా వదిలి గాజువాకలో శంకుస్థాపనలు చేయడమేమిటన్నారు. కార్యకర్తలు చందుకు బాసటగా నిలిచారు.

నేరాలు ఘోరాలు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -రావికమతం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని తట్టబంద పంచాయతీ బూరుగుపాలెంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన నమ్మి అప్పలనాయుడు పూరింటిలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో, ఇంట్లో నిత్యావసర వస్తువులు, సామగ్రి, లక్ష యాభై వేల రూపాయల నగదు, బంగారం దగ్ధమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ గోకివాడ రమణ బాధితులను పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరారు.

అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిని ఎన్నుకోండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'ఓటు హక్కు వినియోగం'పై నైస్ మేన్ పవర్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ, ఒక్క ఓటుతోనే ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యాన్ని ఓటర్లందరూ విడనాడాలని, ఆ ఒక్క ఓటే అందరి భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రజలకు మేలు చేసే నేతలకు పట్టం కట్టాలన్నారు. ఓటు అనే రెండక్షరాలకు దేశ పరిపాలన గతిని, దశ దిశను మార్చే శక్తి ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర చట్టసభలలో, స్థానిక స్వపరిపాలనా సంస్థల్లో అనేక విప్లవాత్మకమైన మార్పులకు ఓటు హక్కు నాంది పలికిందనిఅన్నారు. విద్యాసంస్థల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్లు ఏర్పాటు, స్వీప్, నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్, సెంట్రలూజ్డ్ యూనిక్ డేటాబేస్ సిస్టమ్, సువిధ పోర్టల్, సి-విజిల్ మొబైల్ యాప్, పీడబ్ల్యుడీ మొబైల్ యాప్, 1950 యూనిక్ నంబరు కలిగిన కాల్ సెంటర్ ఏర్పాటు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు, వెబ్ బేస్డ్ కార్యక్రమాలు ద్వారా ఓటర్ల నమోదు వేగవంతంగా జరుగుతుందన్నారు .కార్యక్రమంలో ఇంగ్లీష్ శిక్షకురాలు బి.నేహ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై వ్యతిరేకత తగదు

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రాజ్యాంగంపై వ్యతిరేకత తగదని ప్రముఖ రచయిత గుంటూరు లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన భీమ్ సేన వార్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'భారత రాజ్యాంగం- అవగాహన- ఉద్దేశపూర్వక వక్రీకరణలు' అంశంపై ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే కులనిర్మూలన పోరాటాలను వ్యతిరేకించినట్టేనన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులు, అవకాశాలు కల్పించిందన్నారు. గుజరాత్ ముస్లిములపై దాడి చేసిన కేసులో శిక్ష పడి తిరిగి విడుదలైన వారిని మళ్లీ జైలుకు పంపించిన ఘనత రాజ్యాంగానిదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదలు విద్యా, ఉద్యోగ పరంగా అభివృద్ధి సాధిస్తున్నారంటే దానికి రాజ్యాంగమే కారణమన్నారు. కుల, వర్గ, లింగ పీడనల వ్యతిరేక పోరాటాల ఫలితాలు రాజ్యాంగంలో ఉన్నాయన్నారు. మనువాదులు రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర సాగిస్తున్నారని, హిందూ ఓట్ల కోసం ముస్లిములు, క్రైస్తవులు, దళితులపై తీవ్ర ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు.

విజయవాడలో అంబేద్కర్ ఫొటో గ్యాలరీ- ప్రత్యేకతలు అంశంపై ఏయూ ప్రొఫెసర్ పీడీ.సత్యపాల్ మాట్లాడుతూ విజయవాడలో స్థాపించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ స్మృతి వనంలో అనేక చారిత్రక విషయాలు చోటుచేసుకున్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన భీమ్ సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు, రిజర్వేషన్లు కల్పించడం వల్ల అణగారిన ప్రజలు అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. 2014లో అధికారంలోచ్చిన బిజెపి నిరంతరమూ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎస్ఆర్.వేమన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, మధు కుంచే, వై.బాలకృష్ణ, ఓంకార్, ప్రసాద్, గుడివాడ అప్పారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్ కల్లాం

విద్య, వైద్యంతోనే రాష్ట్రాల మెరుగుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో సుపరిపాలన కోసం మార్పు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్య, వైద్యంతోనే రాష్ట్రాలు మెరుగుపడతాయని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ఎపి సిఎం ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం అన్నారు. 'ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్ ఫర్ అజ్ టు అజ్' పేరుతో నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రైతుల మరణాలు ఎందుకు పెరిగిపోతున్నాయో కారణాలు తెలుసుకునేందుకు తాను అనేక అధ్యయనాలు చేశానన్నారు. పెట్టుబడులు లేకపోవడం, రైతు నిరక్షరాస్యుడు కావడం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చలేకపోవడమే కారణంగా తేల్చి ప్రభుత్వాలకు నివేదించానని గుర్తు చేశారు. రైతుల ఆత్మహత్యలకుగల కారణాల్ని గుర్తించి నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌ను అమల్లోకి తెచ్చి పేదల కళ్లలో వెలుగులు నింపారని గుర్తు చేశారు. వాటికి ప్రస్తుత సిఎం జగన్ మరింత మెరుగులు దిద్దారన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆచార్య ఎవి.ప్రసన్న కుమార్, నాగార్జున యూనివర్సిటీ మాజీ విసి ఆచార్య బాలమోహన్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

'పీవీ జీవితం ఓ ప్రయోగశాల'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ప్రధాని పివి.నరసింహారావు గొప్ప వ్యక్తి అని, ఆయన జీవితం ఓ ప్రయోగశాల అని రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. పివి.నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం దసపల్లా హోటల్లో వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ టీవీ నారాయణ అధ్యక్షతన నిర్వహించిన 'నాలుగు మంచి మాటలు' సమావేశంలో ఆచార్య యార్లగడ్డ మాట్లాడారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావు, సుప్రీంకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది డివిఎస్-ఎస్.సోమయాజులు, పివి మనుమడు ఎన్‌వి.సుభాష్, ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఇలో 9 కోట్ల మంది పెట్టుబడిదారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఇ 9 కోట్ల (90 మిలియన్లు) మంది ప్రత్యేక పెట్టుబడిదారులను అధిగమించిందని ఎన్ఎస్ఇ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ చెప్పారు. నగరంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ శనివారం నాటికి మొత్తం ఖాతాల సంఖ్య 16.9 కోట్లను దాటినట్టు వెల్లడించారు

విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా యార్లగడ్డ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఆదివారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ హిందీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ వినియోగం, ప్రచారంలో అగ్రభాగాన ఉన్న సంస్థ విశ్వ హిందీ పరిషత్ అని చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో భారతీయ సంస్కృతిని హిందీ భాష ద్వారా వ్యాప్తి చేయడానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

వాడవాడలా పల్స్ పోలియో

సీతమ్మధార: స్వర్ణ భారతి సమీపంలోని యుపిహెచ్‌సిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లోనూ, గ్రామ సచివాలయాల్లోనూ పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆయన సతీమణితో కలిసి వెళ్లి కుమార్తెకు పోలియో చుక్కలు వేయించారు.



విశాఖలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

24వ వార్డు పరిధి రేసపువానిపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సూర్యనగర్-2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన పల్స్ పోలియో నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్‌ఒ పి.జగదీశ్వరరావు, పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 3292 మంది పిల్లల లక్ష్యంగా పోలియో చుక్కలు వేశారు. మద్ది గ్రామంలో ఎంపిపి రాంబాబు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ఆనందపురం : మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు నేతృత్వంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు అన్ని గ్రామాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆనందపురంలో స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, ఎల్‌వి.పాలెంలో సర్పంచ్ లోడగల రాజేశ్వరి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. బోని పరిసర ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తనిఖీచేశారు.

తగరపువలస : భీమిలి మండలం తాళ్ళ వలస పిహెచ్‌సిలో పల్స్ పోలియో కేంద్రాన్ని వైద్యాధికారి డాక్టర్ ఎబి మల్లికార్జునరావు ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో ఎఎన్ఎం, ఆశా, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్త సేవలందించారు. తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద పోలియో కేంద్రాన్ని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రారంభించారు. వైద్యులు సుస్మిత ఆధ్వర్యాన పోలియో చుక్కలు వేశారు. భీమిలి సిహెచ్‌సిలో కేంద్రాన్ని వైద్యాధికారి డాక్టర్ వైడి కల్యాణి ప్రారంభించారు. వైద్యులు కళ్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సి పరిధిలో పోలియో కేంద్రాల వద్ద సేవలందించిన 455 మందికి చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన మధ్యాహ్నం ఆహార పొట్లాలు, మజ్జిగ పేకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధి కె.నరసింహ పాల్గొన్నారు.

మధురవాడ : 5,7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్ళా మంగమ్మ ఆధ్వర్యాన పల్స్ పోలియో కార్యకమాన్ని ప్రారంభించారు. మధురవాడ, ఉడాకాలనీ, వాంబే కాలనీ, బొట్టవాణిపాలెం, శివశక్తినగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పలు అంగన్వాడీ కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు.

దేవరాపల్లి: మండలంలోని తారువ గ్రామంలో పల్స్‌పోలియోను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండల కేంద్రంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

మునగపాక: స్థానిక పిఎసిఎల్ ఆవరణలో పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా కుష్టువ్యాధి నివారణ అధికారి ఎంఎస్‌వికె.బాలాజీ, ఎన్‌హెచ్‌ఎం డిపిఒ జగదీష్ పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, ఎంపిటిసి బోడకుర్తి గణేష్, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చంనాయుడు వైద్యాధికారులు విమలగిరి, దుర్గాప్రవల్లిక, సిహెచ్‌ఒ దేవకాంత, పిహెచ్‌ఎన్ అనూరాధ, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, ఎఎన్ఎం లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కశింకోట: మెయిన్‌రోడ్డులోని పల్స్‌పోలియో కేంద్రంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యానాయుడు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, డాక్టర్ తిరుపతిరావు, సర్పంచ్ జయ రజని బయ్యవరంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, తాళ్ళపాలెంలో డాక్టర్ రమేష్ పోలియో చుక్కలు వేశారు.

బుచ్చయ్యపేట: మండలంలోని తురకలపూడిలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పల్స్‌పోలియోను ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.కందిపూడిలో జెడ్‌పిటిసి దొండా రాంబాబు ప్రారంభించారు వైద్యాధికారులు వెంకటకష్ణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో పోలియో కార్యక్రమం విజయవంతమైందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి గోవిందరావు తెలిపారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.బికేపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు. సుంకపూరులో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నక్కపల్లి: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. మండలంలోని గుల్లిపాడులో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్యులు రజని, సురేఖ అధ్వర్యంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.

వడ్డాది: బుచ్చయ్యపేట మండలం వడ్డాది పీహెచ్సీ పరిధిలో వడ్డాది, బంగారు మెట్ట ఎల్బీ అగ్రహారం, లోపూడి తదితర గ్రామాల్లో పోలియో చుక్కలు వేశారు. జెడ్‌పిటిసి దొండ రాంబాబు, సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ జగ్గారావు, వైసిపి నేత దొండా నారాయణమూర్తి పాల్గొన్నారు.

విఆర్ పురం: మండలంలోని రేఖపల్లి పంచాయతీ అన్నవరం, సుద్ధగూడెం, ఉమ్మిడివరం గ్రామాల్లో సర్పంచ్ పూనెం సరోజిని పల్స్‌పోలియోనుప్రారంభించి,. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్త,. ఆశా వర్కర్ పాల్గొన్నారు.

సీలేరు : జికె.వీధిమండలంలోని దారకొండ పిహెచ్‌సి పరిధిలో 1490 మంది చిన్నారులకు, 98శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ డికె. హిమబిందు తెలిపారు. దారకొండ పిహెచ్‌సి, సబ్‌సెంటర్లలో పల్స్‌పోలియోను ప్రారంభించి, పర్యవేక్షించారు. సర్పంచ్ రాజు, ఎంపిటిసి, వైసిపి నేతలు ఎంపిహెచ్‌ఇఒ పోతురాజు, పిహెచ్‌ఎన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పిలు లవ కుమారి, నాగమణి, ఎఎన్ఎంలు కళావతి, కొండమ్మ, ఈశ్వరి, సీత, శోభ పాల్గొన్నారు.

వైద్యాధికారుల ఆలస్యంపై ఆగ్రహం

పల్స్‌పోలియోకు వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్‌వలీ, సౌమ్య ఆలస్యంగా రావడంపై ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీలేరు సంత, చింతపల్లి క్యాంపు, బూసుకొండ ప్రాంతాల్లో పల్స్‌పోలియో కేంద్రాలను పరిశీలించామని, వైద్యాధికారి ఆలస్యంగా రావడం సరికాదన్నారు.

పాడేరు: శత శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. స్థానిక చింతలవీధి సబ్ సెంటర్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1,23,673 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించామన్నారు. 2232 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు.జిల్లాలో 97.6 శాతం మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా తెలిపారు. 1,20,722 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధన పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు చోట్ల పోలియో చుక్కలను వేశారు. మండల కేంద్రంలో స్థానిక పోతంగి పంచాయతీ సర్పంచ్ వెంకట్రావు పోలియో చుక్కలను వేసి ప్రారంభించారు.వైద్యాధికారులు రాంబాబు, అంబిక పాల్గొన్నారు.

పెదబయలు : సీతాగుంట పంచాయతీ పరిధి అంబేద్కర్ పార్క్ ఆవరణలో పోలియో చుక్కలు వేశారు. 66 బూత్‌లలో 3321 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సునీల్ కుమార్ తెలిపారు.

హుకుంపేట: మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్, తదితర చోట్ల పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్‌ఓ జమాల్‌బాషా మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలపై అపోహలు వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి పాల్గొన్నారు.

అనంతగిరి: అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 46 పోలియో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో 2201 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వైద్యులు జ్ఞానేశ్వరి, జాహ్నవి, భార్గవి పాల్గొన్నారు.



దేవరాపల్లి మండలం తారువలో పోలియో చుక్కలు వేస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి